పేరు పెట్టకముందే.. పైలోకాలకు..
- పులిగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మృతుల్లో 20 రోజుల పసికందుతో సహ ఐదేళ్ల చిన్నారి కూడా
- మోపిదేవి ఆలయంలో నామకరణం కోసం వెళుతూ...
- ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో విషాద చాయలు

తెనాలిలో పెను విషాదం 7

పన్ను వసూలులో.. మున్సిపల్టీలు

- పురాల్లో పన్ను వసూలు 45.40 శాతమే
- లక్ష్యాల సాధనలో వెనుకంజ
- కలిసి రాని 50 శాతం వడ్డీ రాయితీ
- పన్ను వసూలు లక్ష్యం రూ. 643.67 కోట్లు
- వసూలు చేసింది రూ. 292.24 కోట్లు
- ఇంకా బకాయిలు రూ. 351.43 కోట్లు
- రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ.. అద్దంకి తృతీయ స్థానం
- అట్టడుగున చిలకలూరిపేట మునిసిపాల్టీ



ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మునిసిపాలిటీలు వెనుక బడ్డాయి. ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ అవకాశం కల్పించినా కలసి రా లేదు. పన్ను చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. అయితే గత ఏడాది కంటే 2.23 శాతం పన్ను వసూలు పెరిగింది. గత ఏడాది 43.17 శాతం పన్ను వసూలు కాగా ఈ ఏడాది 45.40 శాతం పన్ను వసూలైంది. ఆస్తి, తాగునీటి పన్ను వసూలు లక్ష్యం 643.67 కోట్లు కాగా, 292.24 కోట్లు పన్ను వసూలైంది. ఇంకా ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోగా, రూ 351.43 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. పన్ను వసూలులో రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ, అద్దంకి తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీ అట్టడుగున ఉంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో రూ. 522.28 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ 261.09 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను రూ 121.39 కోట్లు కాగా రూ 31.15 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ 261.19 కోట్లు, తాగునీటి పన్ను రూ 90.24 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను 49.99 శాతం, నీటి పన్ను 25.66 శాతం వసూలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మునిసిపాల్టీలలో అస్తి పన్ను 40 శాతం లోపే ఉంది. పల్నాడు జిల్లాకు సంబంధించి మునిసిపాల్టీలలో రూ 77.03 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ. 42.07 కోట్లు వసూలైంది. 54.61 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. తాగునీటి పన్ను రూ . 22.37 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నీటి పన్ను రూ. 7.07 కోట్లు వసూలు చేయగా వసూలు శాతం 31.60 గా ఉంది. వినుకొండ మునిసిపాల్టీ 82.22 శాతం ఆస్తిపన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వడ్డీ మాఫీ చేసినా బకాయిదారులు స్పందించ లేదు.

- గుంటూరు కార్పోరేషన్‌తో సహా జిల్లాలో రూ. 406.97 కోట్లు ఆస్తి పన్ను, రూ 91.83 కోట్లు నీటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ. 194.76 కోట్లు, నీటి పన్ను రూ. 21.77 కోట్లు వసూలు చేశారు. ఆస్తి పన్ను 47.86 శాతం, నీటి పన్ను 23.70 శాతం వసూలైంది. ఈ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకు సంబంధించి దాదాపు 10 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి పన్ను వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల పన్ను బకాయి రూ. 29 కోట్లకు పైగా ఉండగా నామమాత్రంగానే పన్ను వసూలైంది. గుంటూరు కార్పోరేషన్ పన్ను వసూలులో అలసత్వం వలన 41.96 శాతమే పన్ను వసూలైంది.
- బాపట్ల జిల్లాలో మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను రూ 38.28 కోట్లు లక్ష్యం కాగా రూ 24.26 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 7.18 కోట్లకు రూ 2.31 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను 63.39 శాతం, నీటి పన్ను 32.20 శాతంగా నమోదైంది. బాపట్ల మున్సిపాల్టీ మునిసిపాల్టీలో 48.76 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. అద్దంకి మునిసిపాల్టీ 80.01 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..

మునిసిపాలిటీ	లక్ష్యం కోట్లలో	వసూలైన పన్ను కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	20.59	11.20	54.42
చిలకలూరిపేట	22.40	8.86	39.54
వినుకొండ	6.30	5.18	82.22
సత్తెనపల్లి	8.75	5.15	58.83
మాచర్ల	7.63	4.05	53.15
పిడుగురాళ్ళ	6.97	4.82	69.11
దాచేపల్లి	2.49	1.61	64.72
గురజాల	1.90	1.25	65.49
గుంటూరు జిల్లా :			
గుంటూరు	320.52	134.50	41.96
తెనాలి	30.07	18.20	60.54
మంగళగిరి, తాడేపల్లి	48.98	37.56	76.68
పొన్నూరు	7.40	4.98	67.30
బాపట్ల జిల్లా :			
రేపల్లె	6.57	4.85	73.85
బాపట్ల	12.90	6.29	48.76
చీరాల	13.69	9.04	66.08
అద్దంకి	5.12	4.09	80.01

నేడు కొత్త గొల్లపాలెంకు సీఎం చంద్రబాబు

- నాలుగు నెలల వ్యవధిలో రెండోసారి జిల్లాకు
- మరిన్ని వరాలపై జిల్లా వాసుల ఆశలు
- పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నాలుగు నెలల వ్యవధిలోనే జిల్లాకు రెండోసారి సీఎం చంద్రబాబు రానుండడంతో జిల్లాకు దక్కే వరాలపై ప్రజలు ఆశతో ఉన్నారు. గతేడాది డిసెంబరులో బాపట్ల వేదికగా జరిగిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి హాజరైన సీఎం మంగళవారం మరోసారి జిల్లాకు రానున్నారు. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ నేపథ్యం లో జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన పలు అభివృద్ధి పనులు, కీలకమైన ప్రాజెక్టులకు నిధులు మంజూరుతో పాటు ప్రతిపాదన దశల్లో ఉన్న వాటిని సాధించుకునే క్రమం, దశాబ్దాల తరబడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోని తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై సీఎం కురిపించే హామీల జల్లుపై జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నిధులు ఓకే....పారదర్శకంగా ఖర్చే కీలకం

సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం చేసిన నిజాంపట్నం మండల పరిధిలోని దిండి ఆక్వాపార్కు నిర్మాణానికి కూడా రూ.88 కోట్ల నిధుల విడుదలకు అనుమతులు లభించాయి. కానీ ఈ నిధుల ఖర్చు విషయంలో పారదర్శకతే కీలకం కానుంది. ఆక్వా పార్కు నిర్మాణం విషయంలో భూ సేకరణ అంశం రెండేళ్ల నుంచి కొలిక్కి రావడం లేదు. ఆ విషయంలో ప్రభుత్వం దృష్టిసారిస్తేనే నిర్మాణం పట్టాలెక్కే అవకాశం ఉంది. జిల్లా అభివృద్ధికి గ్రోత్ ఇంజన్‌గా ఉపయోగపడే పర్యాటకం, ఆక్వా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు పనులు త్వరితగతిన పూర్తి చేసే విషయంలో పక్కా యాక్షన్ ప్లాన్ ప్రకటన సీఎం నుంచి వస్తుందనే ఆశాభావాన్ని జిల్లా వాసులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అధికసంఖ్యలో ఉండే చేనేత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రాయితీ వరాలు, దాదా పు రూ.15 కోట్ల వ్యయంతో జరుగుతున్న కాలువల మరమ్మతుల పనులు, మోటుపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేయడం, పర్చూరు నియోజకవర్గ రైతులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు నిధుల విడుదలతో పాటు పనుల పురోగతిపై సీఎం ఆరా తీసే అవకాశం ఉంది.

సీఎం పర్యటించే మండలంలోనే...

అత్యంత కీలకమైన రెండు ప్రాజెక్టులకు చినగంజాం మండల పరిధిలోని మోటుపల్లే కేంద్రం అయ్యే అవకాశం ఉంది. ఓడల తయారీ క్లస్టర్‌తో పాటు గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం, కేంద్రబృందం పర్యటించడం జరిగిన సంగతి తెలిసిందే. ఇటీవలే సదరు ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రమంత్రులను సైతం రాష్ట్ర మంత్రి కలవగా సానుకూల స్పందన వచ్చినట్లు తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీకి హాజరయ్యే గ్రామం కూడా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చినగంజాం మండల పరిధిలోనే ఉండడం ఒక ఎత్తయితే ఇదే మండలంలో రెండు భారీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉండడంతో వాటిపై సీఎం చేసే ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చినగంజాం మండలంలో 10 తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.18 కోట్లు ఖర్చు అయ్యే పనుల ప్రతిపాద నలను కూడా ఎమ్మెల్యే ఏలూరి సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

జిల్లా వ్యాప్తంగా 2,24,600 మంది లబ్ధిదారులు

జిల్లాలో పింఛన్లు అందుకునే వారి సంఖ్య 2,24,600 మంది కాగా రూ.96 కోట్లు ఇందుకు ఖర్చు అవుతోంది. వృద్ధాప్య పింఛన్లతో పాటు వితంతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఇందులో ఉన్నారు.



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని, ఎమ్మెల్యేలు సాంబశివరావు, నరేంద్రవర్మ, కొండయ్య, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ

సీఎం పర్యటన సాగేదిలా....

ఉదయం 11:10కి సీఎం చంద్రబాబు చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. 11:40కి అక్కడ నుంచి బయల్దేరి 11:45కి కొత్తగొల్లపాలెం గ్రామానికి చేరుకుంటారు. పింఛన్ అందుకుంటున్న ఇద్దరు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు, ఆర్థిక స్థితిగతులు అడిగి తెలుసుకోనున్నారు. 12:25కి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించడంతో పాటు రెండు ఎలక్ట్రిక్ స్కూటీలను దివ్యాంగులకు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12:35 కి ప్రారంభమయ్యే ప్రజావేదిక కార్యక్రమం 1:30కి ముగియనుంది. 1:40 నుంచి 2:10 వరకు ఉన్న సమయాన్ని రిజర్వ్ చేశారు. 2:15 నుంచి 3:35 వరకు పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. 3:40కి తిరిగి హెలిప్యాడ్‌కు చేరుకోనున్న సీఎం అక్కడ నుంచి 3:45కి బయల్దేరి సాయంత్రం 4:15కి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.



బాపట్ల ఇస్లాంపేట ఈద్గా దగ్గర రంజాన్ ప్రార్థనలనుద్దేశించి మాట్లాడుతున్న జామియా మసీదు ఫేష్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ ఆఫాక్

ఘనంగా రంజాన్

ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) పవిత్ర రంజాన్ పండుగను సోమవారం జిల్లా అంతటా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా ఒకరినొకరు పలకరించుకుంటూ, అలింగనాలు చేసుకుంటూ సందడి చేశారు. అన్ని ఈద్గా మైదానాల వద్దకు పెద్ద సంఖ్యంలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలీసు శాఖ ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండ ముందస్తు చర్యలు చేపట్టారు.



రేపల్లె : 26వ వార్డులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

మహ్మద్ ప్రవక్త అడుగుజాడలలో పయనించాలని అప్పుడే ఉపవాస దీక్షలకు అర్థం ఉంటుందని జామియా మసీదు ఫేష్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ ఆఫాక్ పేర్కొన్నారు. రంజాన్‌పండుగ సందర్భంగా సోమవారం ఉదయం బాపట్ల పట్టణంలోని ఇస్లాంపేట ఈద్గా వద్ద ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఫ్తి మహ్మద్ ఆఫాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రార్థనలు చేసి ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్‌మాసంలో 30రోజులపాటు ఉపవాసదీక్షలుఉండేవారు తప్పనిసరిగా పేదలకు ధానం చేయాలన్నారు. పట్టణంలోని జమేదారుపేట ఈద్గా వద్ద కూడా ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్‌జానీ శుభాకాంక్షలు తెలిపారు.

రేపల్లెలోని ఎస్‌కే అరీఫ్ ఇంట్లో రెవెన్యూశాఖామంత్రి అనగానిసత్యప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి నియోజకవర్గంలోని ముస్లింసోదరులకు రంజాన్‌శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తేనేటివిందులో పాల్గొన్నారు.

ఇది.. నారా వారి ఊరు



సీఎం సొంతూరులో సర్వతోముఖాభివృద్ధి

జడ్పీ హైస్కూలులో ఐఐటీ మద్రాసు పాఠాలు
యువతకు నైపుణ్య శిక్షణ
ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్
గడప గడపకూ తాగునీరు, వంట గ్యాస్

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శేషాచల పర్వతాల పాద భాగంలో పచ్చటి పంటపొలాలు, అడవుల నడుమ ఆవిర్భవించిన నారావారిపల్లె ఒక చిన్న పల్లెటూరు..! తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లె పంచాయతీలో ఓ మజరా గ్రామం. చంద్రబాబు గతంలో 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న సమయంలో టీటీడీ కల్యాణ మండపం, కమ్యూనిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించారు. గతేడాది నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక నారావారిపల్లె అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించడంతో తిరుపతి కలెక్టర్ రంగంలోకి దిగారు. ఇంటింటి సర్వే చేపట్టి కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించి ఆ సమాచారం సీఎం ముందుంచారు. ఆయన సూచనలతో స్వర్ణ నారావారిపల్లె పేరిట సమగ్ర ప్రణాళిక రూపుదిద్దుకుంది. అందులో భాగంగా చంద్రగిరి మండలం కందులవారిపల్లె, ఎ.రంగంపేట, చిన్నరామాపురం పంచాయతీల పరిధిలోని 31 మజరా గ్రామాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లలో.. 2,160 కుటుంబాలకు చెందిన 5,960 మంది జనాభా ఉన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు కుటుంబాల అవసరాలు తీర్చేందుకూ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఈ 2,160 కుటుంబాల్లో 1,830 కుటుంబాలకు సొంత ఇళ్లున్నాయి. 286 కుటుంబాలకు లేవని గుర్తించగా నిబంధనల రీత్యా అర్హత కలిగిన 242 కుటుంబాలకు పీఎంఏవై కింద పక్కా గృహాలు మంజూరు చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి అప్పగిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సదుపాయం లేని 35 కుటుంబాలకు కొద్ది రోజుల్లో వాటిని నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లస్టర్ పరిధిలో 1,202 మందికి వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయి. 137 మంది అర్హులకు మంజూరు కాలేదని గుర్తించారు. 97 మందికి గత నెలలోనే పెన్షన్లు మంజూరు చేశారు. మిగిలిన వారికీ త్వరలో ఇచ్చే ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్లస్టర్ పరిధిలో 87 కుటుంబాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు లేవని సర్వేలో గుర్తించారు. వాటిలో ఇప్పటికే 20 కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వగా.. మిగిలిన వారికి సెప్టెంబరులోపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే 286 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు లేవని తేలగా వారందరికీ వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేశారు.

యువతకు ఉపాధి కోసం శిక్షణ







ఇంటింటి సర్వేలో భాగంగా యువత ఏ రంగంలో శిక్షణ కావాలని కోరుకుంటున్నారో గుర్తించి.. వారికి శిక్షణ కల్పిస్తున్నారు. దానికోసం నారావారిపల్లిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ గ్రామాల పరిధిలోని 35 మంది మహిళలకు జ్యూట్ బ్యాగ్, ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇచ్చారు. తిరుపతికి చెందిన నారీ ఎన్‌జీవోతో ఒప్పందం కుదిర్చారు. జూడియో సంస్థ మెటీరియల్ ఇస్తే మహిళలు దుస్తులు, కవర్లు కుట్టిచ్చేలా ఒప్పందం కుదిరింది. మరో 33 మంది యువతీయువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. 449 మంది సభ్యులున్న 45 మహిళా సంఘాలకు గత మూడు నెలల్లోనే రూ.6.50 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఆ రుణాల ద్వారా 15 మంది మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు అందజేశారు. వాటికి అవసరమైన రీఛార్జింగ్ స్టేషన్ కూడా నారావారిపల్లెలో ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని 7 దుకాణాలకు ఈజీమార్ట్‌తో ఒప్పందం కుదిర్చారు. దుకాణదారులు సరుకుల కోసం తిరుపతికి రాకుండా ఈజీమార్ట్ ద్వారా సరుకులు నేరుగా దుకాణాలకు చేరుతున్నాయి.



స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు

ప్రతి ఎకరం బిందు సేద్యం పరిధిలోకి..

300 మంది రైతులు 1,104 ఎకరాలు సాగు చేస్తున్నారు. అందులో అత్యధికంగా మామిడి పంట ఉంది. ఈ మొత్తం వ్యవసాయ భూమిని డ్రిప్ ఇరిగేషన్ పరిధిలోకి తేవాలని సీఎం ఆదేశించారు. ఈ 3నెలల్లోనే 21 మందికి చెందిన 43.5 ఎకరాలకు డ్రిప్ సదుపాయం కల్పించారు. పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఉద్దేశంతో ఫార్మర్స్ ప్రొడ్యూజ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అందులో 250 మంది రైతులు చేరారు. వీరి ఉత్పత్తుల కోసం ఇప్పటి వరకూ దేశంలో పెద్దగా అమలులో లేని ట్రేసబిలిటీ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. పాడి ఆవుల రక్షణ కోసం గోకులాల పేరిట రూ.2.02 కోట్ల నిధులతో 103 షెడ్లు మంజూరు కాగా.. 87 షెడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి కొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. నారావారిపల్లి క్లస్టర్‌లో రోజువారీ పాల ఉత్పత్తి 5,800 లీటర్లు.

రూ. 155 కోట్లతో అభివృద్ధి పనులు

నారావారిపల్లె క్లస్టర్‌లో రూ.155 కోట్లతో అభివృద్ధి పనులు ప్రతిపాదించగా వాటిలో కొన్ని మంజూరయ్యాయి. ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. గ్రామాల్లో రూ.3.14 కోట్లతో 16 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.6.73 కోట్లతో అవసరమైన చోట్ల డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న ఐదు ఓవర్ హెడ్ ట్యాంకుల పునరుద్ధరణకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. క్లస్టర్ పరిధిలోని 31 హ్యాబిటేషన్లకూ తాగునీరు అందించడానికి రూ. 9.30 కోట్లతో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు పంపించారు. మరోవైపు రూ.120 కోట్లతో హంద్రీనీవా కాలువ నుంచి కళ్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుకు నీరందించే భారీ పథకాన్ని ప్రతిపాదించారు. ఈ నీటితో నారావారిపల్లె పరిధిలోని మొత్తం 1,104 ఎకరాలకు సాగునీరందించే ప్రయత్నం జరుగుతోంది.



ఈ ఆటోతో రోజుకు వెయ్యి సంపాదిస్తున్నా

స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ ఆటోను ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చింది. రూ.3.50 లక్షల విలువ గల ఈ ఆటో 1.50 లక్షలు రాయితీ ఇచ్చారు. దీంతో రోజుకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారు. సీఎం చంద్రబాబు వలన బతుకుతెరువు లభించింది.

- దూపాగు శివ, చిన్నరామాపురం గ్రామం

దేశంలోనే మొదటి కామన్ వర్క్ స్టేషన్: కలెక్టర్ వెంకటేశ్వర్

'నారావారిపల్లె క్లస్టర్‌లో సర్వే సందర్భంగా 48 మంది ఐటీ తదితర ప్రొఫెషనల్స్ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని గుర్తించాం. వీరందరికీ కామన్ వర్కింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల నుంచి ఆ స్టేషన్‌కు వచ్చి పని చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్లేలా సదుపాయాలు కల్పిస్తాం. ఇంటర్నెట్, ఫర్నిచర్, కంప్యూటర్లు అందుబాటులో పెడతాం. అక్కడే కామన్ స్టడీ సెంటర్ కూడా పెడుతున్నాం. ఈ ప్రాంత ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కాలేజీ నుంచి వచ్చాక కామన్ స్టడీ సెంటర్‌కు వచ్చి చదువుకునేలా లైబ్రరీ సహా అన్ని ఏర్పాట్లు చేస్తాం. దేశంలోనే ఈ తరహా ఏర్పాట్లు నారావారిపల్లెలోనే మొదటగా ఏర్పాటు చేయాలని సీఎం పట్టుదలతో ఉన్నారు.'

స్వర్ణ నారావారిపల్లె సాకారానికి చర్యలు

'స్వర్ణ నారావారిపల్లె సాకారానికి ప్రభుత్వం రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేస్తోంది. ప్రతి ఇంటి నుంచీ ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతోంది. ఏ ఇంటి చెత్తను ఆ ఇంట్లోనే ఎరువుగా మార్చేలా హోమ్ కంపోస్టింగ్ విధానం ప్రారంభిస్తున్నాం. అవసరమైన నిర్మాణాలను ఉపాధి హామీ నిధులతో చేపడతాం.'

-సుశీలాదేవి, నోడల్ ఆఫీసర్

స్వయం ఉపాధి కల్పన గొప్ప అవకాశం



మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు ఉచితంగా టైలరింగ్, మహిళలకు డ్రైవింగ్, ఎంబ్రాయిడరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే తపన చాలా గొప్ప విషయం.

- మౌనిక, భీమవరం

మా గ్రామాలకు గొప్ప వరం



మా గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం మూడు సచివాలయాల ప్రజలకు గొప్ప వరంగా భావిస్తున్నాం. సీఎం ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతామనే నమ్మకం ఉంది.

- కుసుమ, శేషాపురం

కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు



ప్రభుత్వ అధికారులు మమ్మల్ని కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు. మేం అభివృద్ధి చెందాలని సాయశక్తులా కృషి చేస్తున్నారు. రోజూ మాతో మాట్లాడుతూ మనోధైర్యం ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలను నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ప్రజలందరూ పాటిస్తే కచ్చితంగా అభివృద్ధి చెందుతాం.

- ప్రశాంతి, నారావారిపల్లె



ప్రతి ఇంటికీ సౌర విద్యుత్

క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లకు పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి అవకాశముందని సర్వేలో తేలింది. రూ.12.63 కోట్ల అంచనాతో అన్ని ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 800 ఇళ్లపై ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. అన్నీ ఏర్పాటు చేస్తే ఏటా రూ.4.86 కోట్ల విలువైన 57.74 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

రంగంపేట స్కూలులో మద్రాసు ఐఐటీ పాఠాలు

ఎ.రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూలుకు మహర్దశ పడుతోంది. సీఎం ఆసక్తితో ఈ స్కూలును శ్రీసిటీ యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. 181 మంది చదువుతున్న ఈ బడిలో కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్, సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పించే ప్రతిపాదనలూ ఉన్నాయి. సీఎంవో, శ్రీసిటీల చొరవతో ఇప్పటికే మద్రాసు ఐఐటీ నిపుణులు 3 నెలలుగా ఇక్కడి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచీ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను గుర్తించి స్కూల్లో చేర్పిస్తారు. నారావారిపల్లె పరిధిలోని పది ప్రాథమిక పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు కల్పించనున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నా కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు

పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక



'ఎల్2:ఎంపురాన్' చిత్రంలో కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై చిత్ర కథానాయకుడు మోహన్‌లాల్ క్షమాపణలు చెప్పారు. తాజాగా చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక స్పందించారు. తన కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఎల్2:ఎంపురాన్' తెర వెనుక ఏం జరిగిందో నాకు బాగా తెలుసు. పృథ్వీరాజ్ సుకుమారన్‌ను అన్యాయంగా నిందిస్తున్నారు. తప్పుడు కథనాలు రాస్తున్నారు. వాటిని చూసి ఓ తల్లిగా ఆవేదన చెందుతున్నా. మోహన్‌లాల్, చిత్ర నిర్మాతలు ఎవరూ తమను పృథ్వీరాజ్ మోసం చేశాడని చెప్పలేదు. ఇప్పుడు ఆయనకు, నిర్మాతలకు తెలియకుండా కొందరు నా కుమారుడిని బలిపశువును చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందరి ఆమోదంతోనే చిత్రం తెరకెక్కింది. కానీ సినిమా విడుదలయ్యాక పృథ్వీరాజ్ మాత్రమే జవాబుదారీ ఎలా అవుతాడు' అని ప్రశ్నించారు.

సరికొత్త పాత్రలో...



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా మరో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. గోపీ ఆచార దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మించనున్నారు. సోమవారం, ఈ చిత్రాన్ని ప్రకటించిన సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. సుహాస్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూలై నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమాకు సంబంధించిన ఇతర తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని త్వరలోనే ప్రకటిస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం 'ఓ భామా అయ్యోరామ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు సుహాస్.

శ్రీరామ నవమి కానుకగా



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా గ్లింప్స్ రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇచ్చింది. శ్రీరామ నవమి కానుకగా ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 6న విడుదల చేస్తున్నట్లు దర్శకుడు బుచ్చిబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆకట్టుకునే ఓ తండ్రి కథ



దిగ్గజ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కీలకపాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'లైఫ్'(లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేశ్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మించారు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈనెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చరణ్ సహకారం వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాలో తండ్రి గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం' అన్నారు. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెక్కించిన చిత్రం ఇదని చరణ్ చెప్పారు.

కుటుంబ కథా చిత్రం



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్-భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ కుటుంబ కథా చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేయడానికి ఈ చిత్రం ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం' అని అన్నారు. దర్శకులు నితిన్-భరత్ మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ 'తన క్యారెక్టర్‌లో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయి' అని తెలిపారు.

అమ్మలందరికీ అంకితం



కల్యాణ్‌రామ్

నరసరావుపేట పట్టణంలోని రవికళా మందిర్ థియేటర్‌లో సోమవారం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రం నుంచి 'నాయాల్ది' అనే తొలిపాట విడుదల చేశారు. నందమూరి కళ్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని అమ్మలకు అంకితం చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పడుకునే వరకు మన గురించి ఆలోచించే అమ్మలకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు. రాబోయే 20 సంవత్సరాల వరకు ఈ చిత్రం గుర్తుండిపోతుందన్నారు. దర్శకుడు చిలుకూరి ప్రదీప్ మాట్లాడుతూ ప్రేక్షకుల భావోద్వేగాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. చిత్రంలో పల్నాడు పౌరుషం కనిపిస్తుందని చెప్పారు. నందమూరి కళ్యాణ్‌రామ్‌కు స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య కోటప్పకొండ త్రికోటేశ్వరుని చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి)

ఈ స్థాయి విజయం ఊహించలేదు

కల్యాణ్ శంకర్



తన తొలి చిత్రం 'మ్యాడ్'తో దర్శకుడిగా సూపర్‌హిట్ అందుకున్నారు కల్యాణ్ శంకర్. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'మ్యాడ్ స్క్వేర్'ను నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో భారీ హిట్ దిశగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు కల్యాణ్. "మొదటి భాగం యువతకు ఎక్కువ చేరువైంది. కానీ రెండో భాగం యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకూ చేరువవ్వడం ఆనందంగా ఉంది. సినిమాకు మంచి స్పందన వస్తుందని ఊహించాం. కానీ, ఈ స్థాయి విజయం అందుకుంటుందని అస్సలు ఊహించలేదు. ఈ సినిమాలో కథ ఉండదు.. కేవలం వినోదం మాత్రమే ఉంటుంది అని ప్రేక్షకులను ముందుగానే సిద్ధం చేయడం కలిసొచ్చింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్, విష్ణుల నటన, వినోదం, భీమ్స్ సిసిరోలియో సంగీతం, నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ విజయం ప్రేక్షకుల ప్రేమాభిమానాలకు అంకితం" అని చెప్పారు.

మరింత చేరువవుతా

వైష్ణవి చైతన్య



'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. సిద్ధు జొన్నలగడ్డతో బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఆమె నటించిన 'జాక్' ఈ నెల 10న విడుదలవుతోంది. అలాగే, ఆనంద్ దేవరకొండతో ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, 'జాక్' సినిమా ప్రమోషన్స్‌లో మీడియాతో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు ఆమె. "ఇప్పటివరకూ అన్నీ సీరియస్ పాత్రలే చేశాను. 'జాక్'లో డ్యూయల్ రోల్ పోషించాను. ఇందులో ఓ పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రంతో కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతాను" అని చెప్పారు.



పూరి మార్క్‌తో

విభిన్నమైన.. విలక్షణమైన పాత్రలతో జాతీయ స్థాయిలో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. కొత్తదనం నిండిన కథలతో అలరించే దర్శకుడు పూరి జగన్నాథ్. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రాబోతోంది. చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. 'ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ కథను రాశారు. ఆయన తనదైన శైలిలో తెరకెక్కించనున్నారు. నటుడిగా విజయ్ సేతుపతిలోని కొత్త కోణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని యూనిట్ తెలిపింది. చార్మీ కౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు.

ఉత్కంఠభరితంగా సాగే...



'అక్కడొకడుంటాడు' ఫేమ్ శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం'. జీ.వి.కె దర్శకత్వంలో కె.ఎస్.శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు జీ.వి.కె మాట్లాడుతూ "ప్రస్తుతం హారర్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ప్రతీక్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ప్రేక్షకులను తప్పక మెప్పిస్తుంది. హారర్ చిత్రాల్లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తుంది" అని చెప్పారు.

శక్తిమంతమైన పాత్రలో...



'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్ జంటగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో దర్శకుడు, నటుడు బండి సరోజ్‌కుమార్ 'క్రిస్టోఫర్ నోలన్' అనే ఓ శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, చిత్రంలో ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామమారుతి.ఎం, సంగీతం: కాలభైరవ.

అడహాక్ ప్రమోషన్లపై దుమారం

◆ ఒక్కో పోస్టుకు రూ. 50 వేలు నుంచి రూ. లక్ష

గుంటూరు సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ అడహాక్ ప్రమోషన్లపై దుమారం చెలరేగింది. అర్హత లేని వారికి ప్రమోషన్లు ఇప్పించేందుకు తెర వెనుక సాగుతున్న ప్రయత్నాలు వివాదాస్పదంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రమోషన్ల పేరుతో నగదు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు హాట్ టాపిక్‌గా మారాయి. రాష్ట్రంలో 141 మంది అడహాక్ ప్రమోషన్లు పొందేందుకు ఫైల్ రూపొందించారు. మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ తంతును ముగించారు. అసిస్టెంట్ సెక్రెటరీలు 50 మంది, గ్రేడ్- 3 సెక్రటరీలు 39, గ్రేడ్-2 సెక్రెటరీలు 28 మంది, గ్రేడ్-1 సెక్రెటరీలు 13 మంది, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీలు 11మంది, సెలక్షన్ గ్రేడ్ ఆరుగురు ప్రమోషన్లు పొందేందుకు వీలుగా ఫైల్ సిద్ధం చేశారు. జీఓ తీసుకువచ్చేందుకు మంతనాలు ఆరంభించారు. ఎవరైతే అడహాక్ ప్రమోషన్ల జాబితాలో ఉన్నారో వాళ్ల ఒక్కొక్కరు రూ. 50 వేలు నుంచి రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుందని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అందులో భాగంగా మొదటి విడతగా రూ. 30 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన మొత్తం జీఓ వచ్చిన తరువాత అందజేసే విధంగా ఉద్యోగుల మధ్య ఒప్పందాలు కుదిరినట్టు చెబుతున్నారు. మొదటి విడత సొమ్మును వసూలు చేసేందుకు ప్రాంతాల వారీగా సెక్రెటరీలకు బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. కోస్తా ప్రాంతంలో మొదటి విడత మామూళ్ల సొమ్మును వసూలు చేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు సెక్రెటరీలను నియమించగా, రాయలసీమ ప్రాంతంలో వసూళ్లకు చిత్తూరుకు చెందిన మరో సెక్రెటరీకి బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది. మొత్తం ఈ వ్యవహారంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కొందరు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రమోషన్లు పొందడానికి అర్హతలు లేనప్పటికీ దొడ్డిదారిన ఉన్నత పోస్టుల్లోకి రావడానికి సాగుతున్న అడహాక్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.

పీ4 విధానం నిరుపేద కుటుంబాలకు వరం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానానికి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలోని పేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో చంద్రబాబు తనకు తానే సాటిగా నిలుస్తారన్నారు. ఈ పథకం దేశానికే మార్గదర్శకంగా నిలవనుందని వివరించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సంపన్న వర్గాలు చేయూతనివ్వడమే పీ4 విధానమన్నారు. ఈ ప్రకటనతో వైసీపీలో వణుకు మొదలైందని, ఇది ఆచరణలోకి వచ్చి, పేదల జీవితాలు మారితే తమకు ఓట్లు రావన్నదే ఆ పార్టీ భయమన్నారు. 40 లక్షల కుటుంబాలను ప్రభుత్వం పీ4కు అర్హత కలిగినవిగా గుర్తించిందని, ప్రభుత్వం నేరుగా ఆయా కుటుంబాలతో అనుసంధానం కాకుండా, లబ్ధిదారులకు, సంపన్నవర్గాలకు మధ్య వారధిగా ఉండి పర్యవేక్షిస్తుందన్నారు. ఈ ప్రక్రియలో కుటుంబాలు, దాతలు ఎవరికి వారే స్వచ్ఛందంగా, మన స్ఫూర్తిగా పీ4లో భాగస్వాములై, తమ జీవితాలకు సార్థకత చేకూర్చుకోవచ్చునని తెలిపారు.

పేరు పెట్టకముందే.. పైలోకాలకు...



లారీని ఢీకొన్న కారు

వారసుడు పుట్టాడని ఆనందంగా దైవ దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఉసురు తీసింది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలుజేసింది. ఈ హృదయ విదారక ఘటన అవనిగడ్డ మండలం పులిగడ్డ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది.

- ● తెనాలిలో పెను విషాదం
- ● పులిగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- ● మృతుల్లో 20 రోజుల పసికందుతో సహా ఐదేళ్ల చిన్నారి కూడా
- ● మోపిదేవి ఆలయంలో నామకరణం కోసం వెళుతూ...
- ● ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో విషాద ఛాయలు

తెనాలి, అవనిగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : లేక లేక పుట్టిన 21 రోజుల పసికందుకు నామకరణం చేయించేందుకు బయలుదేరిన కుటుంబాన్ని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆల యానికి కొద్దిసేపట్లో చేరుతారగా లారీ రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. కారును ఢీకొట్టిన ప్రమాదంలో తాత, నాయనమ్మతో సహా 21 రోజుల పసికందు అక్కడికక్కడే చనిపోతే, ఐదేళ్ల సోదరి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం ఆ కుటుంబంలోనే కాక తెనాలిలోనూ తీర్చలేని పెను విషాదాన్ని నింపింది. తెనాలి చెంచుపేటకు చెందిన గిడుగు రవీంద్రమోహనబాబుకు ఇద్దరు సంతానం. వారిలో కొడుకు కుటుంబంతో కలిసి అందరూ సోమవారం కృష్ణా జిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి తెనాలి నుంచి బయలుదేరి వెళ్లారు. వెళ్లిన గంటలోనే పెను విషాదకరమైన వార్త వారి బంధువులను శోక సంద్రంలో ముంచింది. రవీంద్ర మోహనబాబు (55) తెనాలిలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టరుగా పని చేస్తున్నారు. ఆయన గోదావరి జిల్లాకు చెందిన అరుణను (52) కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి సందీప్ అనే కుమారుడు, మరొక కుమార్తె ఉంటే కుమారుడు గుంటూరులోని ఐటీసీలో ఉద్యోగిగా ఉన్నారు. ఈయన కూడా తెనాలికి చెందిన పల్లవి అనే ఆమెను కులాంతర వివాహమే చేసుకున్నాడు. వీరికి సాత్విక (5), అనే చిన్నారి ఉంటే వారి పెళ్లి తరువాత చాలా కాలానికి ఒక కుమారుడు జన్మించాడు. 21 రోజుల క్రితం పుట్టిన మనువడిని చూసి మురిసిపోయిన ఆ కుటుంబం సోమవా రం మోపిదేవి వెళ్లి ఆలయంలో నామకరణం చేయించాలని నిర్ణయించుకుని కారులో బయలుదేరారు.

పులిగడ్డ - పెనుమూడి వారధి, టోల్ గేట్ల నడుమ కాకినాడ నుంచి పామాయిల్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని కారు రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీటులో ఉన్న సందీప్ తండ్రి జి.ఆర్.మోహన్‌బాబు, వెనుక కూర్చున్న తల్లి అరుణ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక, తల్లి ఒడిలో ఉన్న షణ్ముఖ్(2 నెలలు), డ్రైవింగ్ సీటులో ఉన్న సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారుకు ఇరుక్కుపోయిన మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్విక, సందీప్, పల్లవిలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు సీటు వెనుక పసికందు

క్షతగాత్రులందరినీ ఆస్పత్రికి తరలించటం పూర్తయిందని భావించిన పోలీసులు ప్రమాద స్థలం నుంచి కారును వెనక్కి తీయగా, కారులో సీటు వెనుక పడిన రెండు నెలల పసికందు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పసికందును తీసుకొచ్చారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి అరగంట కావడంతో పసికందును కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తీవ్రంగా గాయపడిన స్వాతికకు రెండు సార్లు వైద్యులు సీపీఆర్ చేశారు. అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో బెలూన్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే సాత్విక మృతి చెందింది. సందీప్ భార్య పల్లవి తలకు తీవ్ర గాయా లు కావడంతో ఆమెను, కాలు, పక్కటెముకలకు తీవ్ర గాయాలైన సందీప్‌ను కూడా మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నా వాళ్లు ఎక్కడ?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్ షాక్‌లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపు తానెవరు, ఎక్కడి నుంచి వస్తుంది కూడా చెప్పలేకపోయిన సందీప్ కొద్దిసేపటి తర్వాత తాము గుంటూరు జిల్లా తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు తెలిపారు. నాకేమైంది.. ఇక్కడెందుకు ఉన్నాను.. నా వాళ్లు ఎక్కడ అంటూ సందీప్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు, వైద్య సిబ్బంది తల్లిదండ్రులు, కుమార్తె, కుమారుడు మరణించారని సమాధానం చెప్పలేక కంటతడి పెట్టుకున్నారు. సందీప్ ఫోన్‌కు తెలిసిన వారి నుంచి ఫోన్ రావడంతో వారు తెనాలి చెంచుపేటకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారి బంధువులను అవనిగడ్డ రావాల్సిందిగా సూచించారు. మోహన్‌బాబు, అరుణ, షణ్ముఖ్ మృతదేహాలను అవనిగడ్డ మార్చురీకి తరలించగా, మచిలీపట్నం వెళ్తూ మార్గమధ్యలో మృతి చెందిన సాత్విక మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.



రవీంద్రమోహనబాబు, భార్య అరుణ, మనుమరాలు సాత్విక, కుమారుడు సందీప్, కోడలు పల్లవి (ఫైల్‌ఫొటో)

చాలా సంవత్సరాల ఎదురు చూపు తరువాత మనువడు జన్మించడంతో కుటుంబమంతా సంతోషంగా ఉన్నారని, నామకరణం చేయించి వద్దామని బయలుదేరితే తిరిగి రాకుండానే మనుమడితో సహా కుటుంబాన్ని ఆ దేవుడు కూడా కరుణించకుండా తీసుకు పోయాడంటూ బంధువులు రోధిస్తున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

- ● మంత్రులు సత్యకుమార్, అనగాని.
- ● రేపల్లె డిపోలో పదిబస్సులు ప్రారంభం

రేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో ప్రయాణికుల కష్టాలను తీర్చేందుకు రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ముందుకు వెళుతున్నారని వైద్యఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం రేపల్లె ఆర్టీసీ డిపోలో పది ఎక్స్‌ప్రెస్ బస్సులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ తీరప్రాంతంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా ఈ బస్సులు ఉపయోగపడతాయన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రేపల్లె నుంచి తిరుపతికి రెండు బస్సు సర్వీస్‌లను ప్రారంభించామని తెలిపారు. 8 నూతన బస్సులు విజయవాడ,గుంటూరుకు వెళ్ళేవిధంగా ఏర్పాటు చేశామన్నారు. రేపల్లె ప్రజలు ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న కోరిక నెరవేరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేపల్లె ఆర్టీసీ డిపోకు రెండు ఇంద్ర ఆర్టీసీ బస్సులను కూడా తీసుకువచ్చామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళనారాయణ మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న ఆర్టీసీని అభివృద్ధి వైపు నడిపించేలా కృషిచేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బ్యాటరీ బస్సులను తీసుకురావటం జరుగుతుందన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని బస్సులను తీసుకువచ్చి రాష్ట్రంలో ఆర్టీసీని ఉన్నతస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుఖవాసి సునీల్‌కుమార్, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గుడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకటశివరామకృష్ణ, జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు అనగాని, సత్యకుమార్ యాదవ్‌లను గజమాలతో సన్మానిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, కార్మికులు

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

తాడేపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న వ్యక్తుల గురించి సమాచారం అందుకున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు సోమవారం ఎయిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డు వద్ద బ్రహ్మానందపురం పరిధిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో ఉంటున్న ముత్యాల మనోజ్‌కుమార్ అలియాస్ బన్ను, వడ్డేశ్వరంనకు చెందిన షేక్ అమీద్‌బాషా, కొలనుకొండకు చెందిన కైలా ప్రవీణ్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 519.70 అడుగులు ఉంది. ఇది 148.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 13,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నాలుగు పళ్ల విభాగంలో జేపంగులూరు ఎడ్లకు ప్రథమస్థానం

తెనాలి అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జేపంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత ప్రథమ స్థానంలో నిలిచాయి. 15 నిమిషాల వ్యవధిలో ఈ ఎడ్లు 4260 అడుగుల దూరం బండ లాగాయి. కొల్లిపరకు చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 4200 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన గాదె సుందరమ్మ, పోతూరి ఆదినారాయణ గోపాల్ కంబైన్డ్ ఎడ్ల జత 3851 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. కృష్ణా జిల్లా మల్లవల్లికి చెందిన రైతు అక్కినేని శాన్వి చౌదరి ఎడ్లు 3803 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన రైతు చాగంటి శ్రీనివాసరావు ఎడ్లు 3616 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, మంగళగిరి మండలం నవులూరుకు చెందిన రైతు బత్తుల శ్రీనివాసరావు ఎడ్లు 3409 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన రైతు గోపినాయుడు, సాంబశివరావుల కంబైన్డ్ ఎడ్లజత 3404 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన రైతు దర్శి సాత్విక్ ఎడ్లు 3075 అడుగుల దూరం లాగి ఎనిదో స్థానం, పల్నాడు జిల్లా కేసానుపల్లికి చెందిన రైతు శ్రీకావ్య రామకోటయ్య కంబైన్డ్ ఎడ్ల జత 3060 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఈ విభాగంలో మొత్తం 15 జతలు పోటీ పడ్డాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు) దాతలు కావూరి కృష్ణమోహన్ రూ.40 వేలు, కొత్తమాసు కుమార్ రూ.30 వేలు, కొత్తపల్లి రవీంద్రబాబు రూ.25 వేలు, కొల్లి నాగఫణింద్రరెడ్డి రూ.20 వేలు, గోగినేని కృష్ణచైతన్య రూ.15 వేలు, సురేంద్రరాజు రూ.12 వేలు, వాసుదేవరావు రూ.10 వేలు, అబ్దుల్ రహీమ్ రూ.8 వేలు, కొడాలి ప్రభాకర్ రూ.6 వేలు అందించారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన జతలకు ప్రోత్సాహక నగదు బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన జేపంగులూరు ఎడ్లజత



నాలుగు పళ్ల విభాగంలో పోటీపడుతున్న ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన రైతు చాగంటి శ్రీనివాసరావు ఎడ్ల జత

వృషనాళాల్లో దిగిన ఆటో హ్యాండిల్

● ఆపరేషన్ చేసి తొలగించిన తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు



తెనాలి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో హ్యాండిల్ వృషనాళాల్లోకి దిగి ప్రమాదకరంగా ఉన్న వ్యక్తికి తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు జనరల్ అనస్థీషియాలో శస్త్రచికిత్స చేసి నిండుప్రాణాన్ని కాపాడారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ టమ్మిశెట్టి దుర్గావర ప్రసాద్ (26) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తెనాలి నుంచి నందివెలుగు వెళుతూ ఎదురుగా ఉన్న వాహనాన్ని ఢీ కొట్టడంతో ఆటో హ్యాండిల్ రాడ్ అతడి వృష నాళాల నుంచి తొడ నరాల మధ్య గజ్జలోకి దిగింది. స్థానికులు హ్యాండిల్‌ను ఆటో నుంచి తొలగించి క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాల అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రోగిని ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ హనుమంతరరావు, వెంకటేశ్వరరావు, అనస్థీషియా డాక్టర్ యశస్వి, డాక్టర్ తులసి నేతృత్వంలో వైద్యబృందం పరీక్షలు నిర్వహించి అనస్థీషియా ద్వారా శస్త్రచికిత్స చేసి హ్యాండిల్‌ను తొలగించారు.

ఆటో అదుపుతప్పి డ్రైవర్ మృతి



మల్లిరాజు (ఫైల్)

మాచర్ల రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలోని అలుగురాజుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని టీకేవీ చెంచుకాలనీకి చెందిన పోగుల పెద్ద మల్లిరాజు (35) ముఠా కూలీలను తీసుకొచ్చేందుకు తాటి అంజి అనే వ్యక్తితో కలిసి ఆటోలో అలుగురాజుపల్లి బయలుదేరాడు. అలుగురాజుపల్లిలోని డొంక రోడ్డులో వెళ్తుండగా ఆటో అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మల్లిరాజు కిందపడడంతో తలకు రాయి బలంగా తగిలి తీవ్ర గాయంతో అక్కడికక్కడే మృతిచెందగా అంజి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహ్మద్ షఫి సంఘటనా ప్రాంతానికి చేరుకుని మల్లిరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వీఆర్వో కోటయ్య మృతదేహం లభ్యం



ఆవుల కోటయ్య (ఫైల్)

పిడుగురాళ్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆవుల కోటయ్య (50) మృతదేహాన్ని సోమ వారం పిడుగురాళ్ల సమీపంలోని జూలకల్లు లాకుల వద్ద పిడుగురాళ్ల పోలీసు లు గుర్తించారు. మృతుడు మార్చి 29న రేమిడిచర్ల నుంచి చిలకలూరిపేటలో నివాసముంటున్న చిన్న కొడుకు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి అక్కడికి వెళ్ల కుండా కారంపూడి సమీపంలోని జూలకల్లు వద్ద వున్న సాగర్ కాలువ బ్రిడ్జిపై నిలబడి వీడియో కాల్ చేసి చనిపోతున్నట్లు మనవరాలికి చెప్పడంతో కుటుం బ సభ్యులు కారంపూడి నుంచి నాగార్జునసాగర్ కాల్వ వెంట వెతుకుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మనవరాలికి వీఆర్వో కోటయ్య వీడియో కాల్‌లో తనకు అప్పుల సమస్య వున్నట్లు చెప్పడంతో పాటు మృతుడు భార్య గాలమ్మ సోమవారం పిడుగురాళ్ల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అప్పుల బాధ వున్నట్లు తెలిపింది. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో జూలకల్లు లాకుల వద్ద కోటయ్య మృతదేహం కుటుంబసభ్యులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఒకరు గల్లంతు

నకరికల్లు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు దిగి ఒకరు గల్లంతైన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం మండలం పెద నెమలిపురి గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు ఈత కొట్టేందుకు శ్రీరాంపురం వద్ద గల బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో దిగారు. చిట్యాల హర్షతుల్లా(21)కి ఈత రాక పోవటంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి కాలువలో కొట్టుకు పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు హర్షతుల్లా ఆచూకీ కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. హర్షతుల్లా ఆచూకీ లభించ లేదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

బాపట్ల వార్తలు

• బాపట్ల • వేమూరు • రేపల్లె


పొలాలలో గొర్రెలు మేపుతున్న బాలుడు

అక్షరాలు దిద్దాల్సిన చేతులతో.. గొర్రెలు మేపుతూ!

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బడిబయట పిల్లలు ఉండకూడదు, సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటూ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా.. అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఆ దిశగా కార్యరూపం దాల్చటం లేదు. బడికెళ్ళి అక్షరాలు దిద్దాల్సిన వయసులో ఉన్న ఓ పిల్లోడు చేతిలో కర్ర, సంకలో వాటర్‌బాటిల్, అన్నం బాక్స్ పెట్టుకొని గొర్రెల మందను తోలుకొని పొలాల వెంట తిరుగుతూ కనిపించాడు. బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన ఆ బాలుడు తండ్రికి తోడుగా పొలాలు వెంట, నీటి కుంటల వెంట గొర్రెలను తిప్పుతూ ఎండకు ఎండుతూ ఉన్నాడు. అధికారులు ఇలాంటి వారిని గుర్తించి బడిలో చేర్పించి వారి బాల్యం ఛిద్రం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంటింటికి తిరిగి పెన్షన్లు పంపిణీ చేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంగళవారం ఉదయం 7గంటల నుంచి రాత్రి 7 గంటలలోపు ఇంటింటా తిరిగి పంపిణీ చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. వార్డు ప్రెసిడెంట్‌లు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు ప్రతి ఇంటికెళ్ళి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పెన్షన్లు పంపిణి చేసి ఫొటోలను పార్టీ కార్యాలయాలకు పంపించాలన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ప్రార్థన ప్రదేశాలలో పటిష్ట బందోబస్తు

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ముస్లిం ప్రార్థన స్థలాల వద్ద సోమవారం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా బందోబస్తు నిర్వహించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎవరైన సందేశాలు, వదంతులు వ్యాప్తి చేస్తే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు

టీడీపీ సభ్యత్వ కార్డులు అందజేత

పిట్టలవానిపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మనిషి జీవితంలో ఐడెంటిటీ అనేది చాలా విలువైనదని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి అన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని సంగుపాలెం గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను ఆమె సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీకి చెందిన మట్లపూడి నిఖిల్, బర్మ జాన్‌బాబు, బర్మ శామ్యూల్, బర్మ చంటి, చందోలు రవికుమార్, జి.బాబురావు, చెరుకూరి యాదయ్య, సంపతి, దేవరకొండ అజయ్, బర్మ పిన్ని, రఫయేలు, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


సభ్యత్వ కార్డులు అందజేస్తున్న డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి తదితరులు

శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠను నిర్వహిస్తున్న చిత్రం

బాపట్ల రూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామంలో సోమవారం శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్థులు ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి భక్తులు ప్రత్యేకపూజలను నిర్వహించారు. వేదపండితులు యజ్ఞహోమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నసంతర్పణ నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్ధప్రసాదాలను స్వీకరించారు. శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భర్తీపూడి గ్రామం మొత్తం జైశ్రీరామ్ అంటూ నినాదాలు మారుమోగాయి.

వంతెన నిర్మాణానికి భూమిపూజ

బాపట్లరూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ సుబ్బారెడ్డిపాలెం గ్రామంలో ఉన్న వెస్ట్ బాపట్ల ఛానల్ కాల్వకు రెండువైపుల ప్రజలు నివసిస్తున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఎన్నికల సమయంలో వేగేశన నరేంద్రవర్మకు సమస్యను తెలపగా ఈ కాల్వపై వంతెన నిర్మిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆదేశాల మేరకు బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి తన సొంత నిధులతో వంతెన నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. వంతెన నిర్మాణం ప్రారంభం కావటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి

కావూరిని సన్మానించిన జనసేన నాయకులు


శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న జనసేన నాయకుడు సురేష్ తదితరులు

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కావూరి శ్రీనివాసరెడ్డిని జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకులు విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఆయనను కలిసి అభినందించి ఘనంగా సత్కరించి సన్మానించారు. కావూరి నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, పట్టణ నాయకులు కారుమూరి అంజనేష్, గరిగంటి శ్రీనివాసరావు, మాడసాని బాలాజీ, ఎస్.రాంబాబు, తిరుమలశెట్టి సాగర్, కామిశెట్టి సాయి, పెద్ది నాగు, దాసరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త అడుగుజాడలలో పయనించాలి

● జామియా మసీదు ఫేష్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ ఆఫాక్
● ఘనంగా రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు


బాపట్ల ఇస్లాంపేట ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త అడుగుజాడలలో పయనించాలని అప్పుడే ఉపవాస దీక్షలకు అర్థం ఉంటుందని జామియా మసీదు పేష్ ఇమామ్ ముఫ్తి మహ్మద్ ఆఫాక్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం బాపట్లలోని ఇస్లాంపేట ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఫ్తి మహ్మద్ ఆఫాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రార్థనలు చేసి ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్‌మాసంలో 30 రోజులపాటు ఉపవాస దీక్షలు ఉండేవారు తప్పనిసరిగా పేదలకు దానం చేయాలన్నారు. ముస్లింలు సద్భావన, సహృదయంతో ఆలింగనాలు చేసుకొని పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రార్థనలకు ముందు ఈద్గా వద్ద ఫిత్రా, జకాత్, సదఖా దానధర్మాలు చేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు బంధుమిత్రులకు రంజాన్ ప్రత్యేక వంటకాలు, సేమియా, కీర్, మిఠాయిలు అందజేశారు. స్థానిక అంజుమన్‌కమిటీ ఆధ్వర్యంలో ప్రార్థనలకు విచ్చేసిన ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం, ముస్లిం పెద్దలు, పట్టణ పోలీసులు పర్యవేక్షించారు. అదేవిధంగా పట్టణంలోని జమేదారుపేట ఈద్గా వద్ద కూడా ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్‌జానీ శుభాకాంక్షలు తెలిపారు.

వేమూరులో...


జంపనిలో ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

వేమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఈద్గాల వద్దకు చేరుకున్నారు. ఇమామ్‌లు, మత పెద్దలు పండుగ విశిష్టతను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పేదలకు శక్తి కొలది దానాలు చేశారు. మహిళలు వారి సంప్రదాయం ప్రకారం ఇళ్లలోనే ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. మసీదుల వద్ద సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రేపల్లెలో...

రేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జామియా పెద్ద మసీద్, మదీనా మసీద్, లక్ష్మీటాకీస్‌సెంటర్లోని మర్కస్ మసీద్, పెనుమూడి రోడ్‌లోని మదీనా మసీద్‌లలో సోమవారం ప్రార్థనలు చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మోర్లవారిపాలెం రోడ్‌లోని ఈద్గా వద్దకు ముస్లింలు పట్టణం నుంచి ర్యాలీగా వెళ్ళి పార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ ప్రార్థనలలో ఇమామ్‌లు, మౌజంలు, ఖురాన్ ప్రవచనాలు తెలియజేశారు. పట్టణంలోని 26వ వార్డులో గల ఎస్‌కే ఆరీఫ్ ఇంట్లో మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జమీర్, షేక్ సలీమ్, షేక్ ఖాదర్ బాషా, డొక్కు బుజ్జి, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో...

భట్టిప్రోలు, కొల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని ముస్లింలు రంజాన్ పురస్కరించుకుని మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అనంతరం సామూహికంగా ఈద్గాల వద్దకు తరలి వెళ్లి అక్కడ ప్రార్థనలు జరిపారు. ముస్లిం మత పెద్దలు ఖురాన్ పఠించారు.


కొల్లూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకొని పిట్టలవానిపాలెం మండల వ్యాప్తంగా సోమవారం ఆయా ఈద్గాలు, వివిధ మసీదుల వద్ద ముస్లింలు ఈదుల్ ఫితర్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని చందోలు, నదిముల్లాపాలెం, కోడూరు, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, అల్లూరు తదితర గ్రామపంచాయతీలకు చెందిన ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక నమాజ్‌లు ఆచరించారు. ముస్లింలకు వివిధపార్టీలకు చెందిన నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ మండల అధ్యక్షులు మహ్మద్ అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి, బాపట్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కలకోట కిషోర్, క్లస్టర్ ఇన్‌చార్జి మోదుగుల శంకరరెడ్డి, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం, ప్రధాన కార్యదర్శి సైద్ జునేద్, టీడీపీ మండల మైనార్టీ నాయకుడు షేక్ మీరా, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షులు మహ్మద్ రజాక్, చందోలు టీడీపీ యువనాయకులు సయ్యద్ నిజాం తదితరులు ఉన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ షేక్ బాజి, రాష్ట్ర రహదార్ల డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, చందోలు వైసీపీ అధ్యక్షుడు అమీర్‌ఖాన్, చేబ్రోలు కృపానందం, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు కె.అనూషప్రసన్న, బి.అరుణకుమారి, సుబ్బారావు, మంతెన గంగరాజు, వివిధ మండల, గ్రామస్థాయి అధికారులు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


చందోలులో నమాజ్ అనంతరం ముస్లింలకు దువా చేస్తున్న ఇమామ్

కర్లపాలెంలో...

కర్లపాలెం, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం కర్లపాలెం దండుబాట రోడ్డు పక్కన ఉన్న ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనలలో ముస్లింలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


జంపనిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తపరుస్తున్న ముస్లింలు

కేంద్రానికి వ్యతిరేకంగా ముస్లింల నిరసన

వేమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మండలంలోని జంపని గ్రామానికి చెందిన ముస్లింలు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తపరిచారు. వక్ఫ్ ఆస్తులకు కొత్త చట్టాన్ని తీసుకు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తపరిచినట్లు ముస్లింలు తెలిపారు. అమాజ్ కమిటీ, ఢిల్లీలోని జామా మసీదు నుంచి రాష్ట్ర సంఘానికి అందిన సమాచారం మేరకు ఈ ప్రదర్శన నిర్వహించినట్లు పేర్కొన్నారు. రంజాన్ పండుగ రోజున మసీదుల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించిన ముస్లింలు అక్కడ ప్రత్యేక ప్రార్థనల్లో, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో కూడా నల్ల బ్యాడ్జీలతోనే పాల్గొన్నారు.

బాపట్లలో...

బాపట్ల, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు బిల్లు సవరణపై నల్లరిబ్బన్‌లు ధరించి ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం సవరణ చేస్తూ చట్టాన్ని తీసుకురావాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్‌జానీ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డులో అన్యమతస్థులను నియమించటాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వానికి ముస్లిం వక్ఫ్ బోర్డు ఆస్తులపై కన్నుపడిందన్నారు. బలవంతంగా ఆర్టికల్ 370, త్రిబుల్ తలక్ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సెక్రటరి అబ్దుల్ కరీం, ఉపాధ్యక్షుడుషేక్ బాజి, జాయింట్ సెక్రటరి మహ్మద్ రఫీ, కోశాధికారి మీరా సాహెబ్, సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కర్లపాలెంలో ముస్లింలు నల్లబ్యాడ్జీలతో సోమవారం నిరసన తెలిపారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మైనారిటీల హక్కులకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు బిల్లుకు, ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్నామని అన్నారు. ఈ సవరణలు ముస్లింలను మాత్రమేకాకుండా ఇతర మైనార్టీ వర్గాలను కూడా ప్రభావితం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.


కర్లపాలెంలో నిరసన తెలుపుతున్న ముస్లిం పెద్దలు

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : 'జొనేట్ ఫర్ పూర్' స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. మండలంలోని బలిజేపల్లిలో సోమవారం నీలా ఆనందరావు, కమలమ్మ జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉచిత మెగా శిబిరాన్ని నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని విజయబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య పరీక్షలు, మందులు కూడా ఉచితంగా ఇవ్వడం వల్ల నేటి పరిస్థితుల్లో పేదవాడికి ఈ సేవ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నీలాభూషణం సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు అచ్చం శెట్టి అన్వేష్‌కుమార్, జల్లేపల్లి తేజస్విని, కాసుల సాయిరాజశేఖర్, బడుగు పవన్ 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకుడు సుధాకర్, సురేంద్ర, విశ్వం, రాజేష్, వెంకయ్య, సంస్థ ప్రతినిధులు రాకేష్, దేవరాజ్, హర్షిత, సర్పంచ్ వెంకాయమ్మ పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్, మెంబర్లు, జువెనైల్ జస్టిస్ బోర్డులో సోషల్ వర్కర్ మెంబర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అధికారి వి.సౌందర్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 9లోగా దరఖాస్తులను నిర్దేశిత విధానంలో అర్హత ధ్రువీకరపత్రాల నకళ్ళతోపాటుగా విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలన్నారు. వివరాలకు 9182075076లో సంప్రదించాలన్నారు. దరఖాస్తులను డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణలు, వీధిబాలల సంక్షేమ శాఖ, విజయవాడకు పంపించాలన్నారు.

శ్రీ సత్యసాయిబాబా సేవాసమితిలో పంచాంగ శ్రవణం

కర్లపాలెం, మార్చి31 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సత్యసాయిబాబాసేవా సమితిలో పరిమి శివన్నారాయణ పంచాంగ శ్రవణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం రామకృష్ణ ఎడ్యుకేషన్ సొసైటీ తరుపున పెనుమెత్స బాపిరాజు, పార్వతమ్మలు పంచాంగం పుస్తకాలను అందజేశారు అలాగే కవిసమ్మేళనం నిర్వహించారు. రామకృష్ణ ఎడ్యుకేషన్ సొసైటీ, వాసవి, క్విన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కవులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కవులు సత్యసాయి సంస్థలు చేస్తున్న సేవలను పద్యాల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కవులు మంతెన శివరామరాజు, మహబూబ్ సుభానీ, పి.వీరాంజనేయులు, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.


సనాతన వేదాంత నిష్ఠాశ్రమ శ్రీ సరస్వతి విద్యామందిర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, సత్యకుమార్‌యాదవ్ తదితరులు

విద్యారంగంలో భారీ సంస్కరణలకు శ్రీకారం

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టనున్నామని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం చాట్రగడ్డ గ్రామంలో సనాతన వేదాంత నిష్ఠాశ్రమ శ్రీసరస్వతి విద్యామందిర్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపనలో సోమవారం ఆయన పాల్గొని పూజలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ గత ప్రభుత్వంలో గాడితప్పిన విద్యావ్యవస్థను సరైన దారిలో పెడుతున్నారన్నారు. సరస్వతి విద్యామందిర్‌కి ఎంతో ఘనమైన కీర్తి ఉందని పాఠశాల నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి రేపల్లెకే గర్వకారణంగా ఉండేదన్నారు. గత ఐదేళ్ళ పాలనలో విద్యార్థులు లేక వెలవెలబోవటంతో ఆర్ఎస్ఎస్ యాజమాన్యం తీసుకుని పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. పూర్వవిద్యార్థులు, దాతల సహకారంతో రూ.9 కోట్లతో విద్యార్థులకు ఉపయోగపరంగా అధునాతన భవనం నిర్మించటం జరుగుతుందన్నారు. వైద్యశాలల పరంగా వెనుకబడ్డ రేపల్లె ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను ఆయన కోరారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ల పోస్టులను భర్తీ చేయబోతున్నామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వచ్చేనెల నుంచి తల్లికివందనం అమలు జరగనున్నదన్నారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ సీఎం చంద్రబాబు తలపెట్టిన పీ4 కార్యక్రమం గొప్ప ఆలోచనగా పేర్కొన్నారు. మోడీ నుంచి చంద్రబాబు వరకు అందరూ మాతృభాషలో చదువుకున్నవారేనన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ, పాఠశాల కార్యదర్శి నార్ల సాయన్న, అధ్యక్షుడు కె.రమేష్, కృష్ణచంద్ర, తొట్టెంపూడి సుభాష్, దుగ్గిరాల అశోక్‌కుమార్, సుఖవాసి నాగశ్రీ, సర్పంచ్ గంగాధరరావు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు.

పెరవలి-గంగోలు వంతెన వద్ద గోడ నిర్మించాలి

● పెరవలి రైతుల వినతి


పెరవలి-గంగోలు వంతెన వద్ద కోతకు గురైన కాల్వకట్ట

వేమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి-గంగోలు వంతెన వద్ద కోతకు గురైన కట్టను బలోపేతం చేసి గోడ నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. రేపల్లె ప్రధాన మురుగు కాల్వపై పెరవలి వద్ద వంతెన నిర్మాణం జరిగింది. వరదలు వచ్చిన సందర్భంలో వంతెన సమీపంలో ఉన్న కట్ట బలంగా లేని కారణంగా కోతకు గురవుతున్నది. ఎప్పటికప్పుడు రైతులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. 2024లో సంభవించిన వరదలకు పూర్తిగా కట్ట కోతకు గురి కావడం వల్ల రైతులు తమ భూములకు వెళ్లేందుకు, సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటికకు మృతదేహాలను తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైయిన్‌లో ప్రవహించే మురుగునీటిని వెయ్యి ఎకరాలకు సాగు చేసుకునేందుకు రైతులు వాడుకుంటారు. కట్ట కోతకు గురి కావడంతో కాల్వ నుంచి ఇంజన్‌ను పెట్టుకునేందుకు అసౌకర్యం ఏర్పడింది. ప్రస్తుతం రైతులు కోతకు గురైన ప్రాంతం మరింతగా కోత పడకుండా ఉండేందుకు సర్వీబాదులతో అడ్డుకట్ట వేశారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి తక్షణమే నిధులు విడుదల చేయించి కట్టను బలోపేతం చేయడంతో పాటు అర కిలోమీటరు దూరం వరకు గోడ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిని వంద పడకలుగా తీర్చిదిద్దాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు సాంబశివరావు


మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రేపల్లె బీజేపీ నాయకులు

రేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె ప్రభుత్వ వైద్యశాల 30 పడకల ఆసుపత్రిగా ఉందని, దానిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిన్నిసాంబశివరావు సోమవారం వైద్య ఆరోగ్య శాఖా మంత్రికి వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రేపల్లె నియోజకవర్గంలో సరైన వైద్యసదుపాయాలు పూర్తిస్థాయిలో లేవన్నారు. పీహెచ్‌సీలలో కూడా నామమాత్రంగా వైద్యసేవలు అందుతున్నాయని, ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గుండెకు సంబంధించిన వ్యాధులు ఏమైనా వస్తే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొందని, అత్యవసర వైద్యసేవలు అందించే పరిస్థితి లేదన్నారు. రేపల్లె వైద్యశాలకు నిధులు మంజూరు చేసి కార్డియాలజీ విభాగాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాకా శివరామ్‌ప్రసాద్, మద్దు సురేష్, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు, అన్నం సాయి వరప్రసాద్, పినకాల సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో టీచింగ్ ఆసుపత్రి పూర్తి చేయాలి


మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో నిలిచిపోయిన బాపట్ల టీచింగ్ హాస్పటల్ పనులు ప్రారంభించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. రేపల్లెలో జరిగే కార్యక్రమానికి హాజరైన మంత్రిని పార్టీశ్రేణులతో లక్ష్మీనారాయణ ఆయనను కలిశారు. బాపట్ల ప్రజల ఆరోగ్యభద్రతకు, వైద్య విద్యార్థులకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన టీచింగ్ ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రాధాన్యత క్రమంలో ఏడాదిలో పనులు ప్రారంభించేవిధంగా చూస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రమేష్ తదితరులు ఉన్నారు.

కాల్వలో పడిన కారు


కాల్వలో కారు

అమృతలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కాల్వలో కారు పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పెదపూడి వంతెన సమీపంలో కారు కాల్వలోకి వెళ్లింది. అదృష్టవశాత్తు కారులోని వారికి స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు నిజాంపట్నంనకు చెందిన వారిదిగా చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన ప్రాంతానికి వెళ్లారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

అవీ..ఇవీ



స్వామివార్ల పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దాతలు

సీతారామలక్ష్మణ పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం

తిమ్మరాజుపాలెం(పర్చూరు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం తిమ్మరాజుపాలెంలో సోమవారం శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆనంతరం విగ్రహాలకు వేద మంత్రాలతో శాస్త్రయుక్తంగా సంప్రోక్షణ, హోమం, శుద్ధి చేసిన అనంతరం పర్చూరులోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయానికి అందజేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ విగ్రహాలతో స్వామివార్ల కల్యాణ వేడుకలను నిర్వహించుకునే వీలుగా అందజేశామని విగ్రహదాతలు నర్రా రామయ్య, శిరీష దంపతులు తెలిపారు.



ముక్తేశ్వరంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

బల్లికురవ. మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ప్రవేశ పెట్టిందని, అందుకు నిరసనగా తాము మత పెద్దల ఆదేశాల మేరకు నిరసనలు చేపడుతున్నామని ముస్లింలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రంజాన్ పండగ సందర్భంగా గ్రామంలో ఉన్న ఈద్గా వద్దకు చేరిన ముస్లింలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీవో కాపీలతో నిరసనకు దిగారు. గ్రామ వీధులలో వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

యనమదల కార్యదర్శిపై ఫిర్యాదు

యద్దనపూడి(మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించారని వారం రోజుల క్రితం గ్రామస్థులు బాపట్లలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై డీపీవో సంబంధిత కార్యదర్శిని పిలిపించి విచారణ చేసినట్లు సమాచారం. గ్రామ కార్యదర్శి పంచాయతీ నిధులను తన పంచాయతీలో పనిచేసే స్వీపరు ఖాతాకు మళ్లించిన అనంతరం తిరిగి వాటిని తనకు సంబంధించిన వ్యక్తుల ఖాతాకు మళ్లించారని గ్రామస్థులు కార్యదర్శిపై కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు సంబంధించి ఇన్‌చార్జ్ ఎంపీడీవో కృష్ణను సోమవారం ఆంధ్రజ్యోతి వివరణ కోరగా యనమదల పంచాయతీ కార్యదర్శిపై కలెక్టరుకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై కలెక్టరు కార్యాలయం నుంచి తమకు గ్రామస్థులు చేసిన ఫిర్యాదు పత్రం వచ్చిందన్నారు.ఈ విషయమై విచారణ చేసేందుకు ఇంకా అధికారిని నియమించలేదన్నారు.

కారు ఢీకొని ఆటో బోల్తా

15 మంది కూలీలకు తీవ్ర గాయాలు

ఇరువురి పరిస్థితి విషమం

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య

చినగంజాం(చీరాల), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కారు రూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది. చినగంజాం - రొంపేరు మధ్యలో ఆటోను ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. 15 మంది కూలీలకు, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చీరాల మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన బ్రహ్మేశ్వరి, శివ, పోలేరు, హేమలత, ఆదిలక్ష్మి, రమాదేవి మరో తొమ్మిది మంది రోజులాగే నాగులుప్పలపాడు సమీపంలోని ప్రాసంగులపాడు వద్ద మిర్చి కోతలకు ఆటోలో వెళ్లారు. సాయంత్రం వరకు పనులు చేసి తిరిగి ఆటోలో ఇంటికి వెళుతుండగా చినగంజాం - రొంపేరు మధ్యలోని రహదారిలో ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఆటోను ఢీకొంది. దీంతో ఆటో ఎగిరి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న మహిళలు అందరూ తీవ్రంగా గాయపడ్డారు. వారందరూ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అలాగే కారు డ్రైవర్ సమీర్, మరో వ్యక్తి షంషాద్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈక్రమంలో సమీర్‌ను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, షంషాద్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. గాయపడిన కూలీలు కూడా చీరాల ఏరియా వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నారు.



హాస్పిటల్ వార్డులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

మెరుగైన వైద్యం అందించండి -ఎమ్మెల్యే

ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు. ప్రమాదం గురించి బంధువులతో మాట్లాడి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.



తీవ్ర గాయాలతో కుప్పకూలిన బ్రహ్మేశ్వరి



అపస్మారక స్థితిలో షంషాద్



కలెక్టర్, జేసీల చేతుల మీదుగా ఉగాది ప్రభుత్వ పురస్కారాన్ని అందుకుంటున్న పద్యకళా కారుడు రామిశెట్టి వెంకటసుబ్బారావు

రామిశెట్టికి ఉగాది పురస్కారం

మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకట సుబ్బారావు ఆదివారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ల నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. పౌరాణిక, పద్యకళాకారునిగా గుర్తింపుపొంది,భగవద్గీతను గానం చేస్తూ,సినీ రంగస్థల కళాకారునిగా సుబ్బారావు ప్రజల మన్ననలను పొందారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆర్‌డీవో గ్లోరియా పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న వాసవి వనిత క్లబ్ సభ్యులు

రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ

అద్దంకిటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ జోన్ చైర్మన్ వెంకట ఆదినారాయణ ఫ్రెండ్లీ విజిట్ సందర్భంగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలు, పిల్లలకు దుస్తులు, ఆహారం అందించినట్లు క్లబ్ ప్రెసిడెంట్ కె. లావణ్య, సెక్రటరీ ఎల్. పద్మావతిలు తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చినగంజాం, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలో మంగళవారం పేదల సేవ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లను మంత్రులు సోమవారం పరిశీలించారు. పింఛన్‌దారుల గృహాలను, సీఎం పూజలు నిర్వహించే కోదండరామాలయం, హెలిప్యాడ్, ప్రజావేదిక తదితర వాటిని సోమవారం సాయంత్రం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు, బాపట్ల, చీరాల శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ, ఎంఎంకొండయ్యలతో కలిసి పరిశీలించారు. సీఎం పింఛన్ అందజేసే గృహాలకు వెళ్లి వారితో మాట్లాడారు. దివ్యాంగ పింఛన్ పొందే వడ్లమూడి సుభాషిణి ఇంటి వెళ్లి ఆమె తాత ఎల్లవుల వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. గృహ నిర్మాణం, సుభాషిణి తల్లికి ఒంటరి మహిళ పింఛన్ అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సీఎం తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రతి నెలా 64లక్షల పెన్షన్లను ప్రతి నెలా 1వ తేదీ ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో పంపిణీచేస్తున్నారని అన్నారు. అలాగా రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం పెంచటానికి సీఎం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు అప్పులు చేసినప్పటికీ తమ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపకుండా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీరాల అభివృద్ధికి సహకరించండి

చీరాల : నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉందని, అలాగే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పర్యవేక్షణకు విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మలను ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించారు. ఈక్రమంలో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.



దివ్యాంగ పెన్షన్ అందుకునే సుభాషిణి తాతతో మాట్లాడుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి):విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో పింఛన్లు పంపిణీలో పాల్గొననున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



అద్దంకి పట్టణం శింగరకొండ రోడ్డులోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అద్దంకి,మార్చి31(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగను సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాసం ఉండి ఆదివారం రంజాన్‌ను జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డు, టైలర్స్ కాలనీ, ఒంగోలు రోడ్డులోని రాజీవ్ కాలనీ తదితర ప్రాంతాలలోని ఈద్గా ల వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని దేనువకొండలో ముస్లింలతో కలిసి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. మణికేశ్వరంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో 23 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలకు హాజరై ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో ముస్లింలు సోమవారం రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న మసీదులకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ప్రార్థనలు చేశారు.

పంగులూరు : రంజాన్ సందర్భంగా మండలంలోని అలవలపాడు, రామకూరు, పంగులూరు గ్రామాలలో ముస్లింలు వందల సంఖ్యలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిత్రా సమర్పించారు. ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకుంటూ సందడి చేశారు.

మేదరమెట్ల : మేదరమెట్లలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతేక ప్రార్థనలో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు.

చీరాల : నియోజకవర్గ పరిధిలోని మసీదుల్లో సోమవారం రంజాన్ వేడుకలు జరిగాయి. స్థానిక సాల్మన్ సెంటర్, పేరాల మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం వారితో ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మార్టూరు :మండలంలోని వలపర్ల, నాగరాజుపల్లి, బొబ్బేపల్లి తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మసీదుల వద్ద దానధర్మాలు చేశారు

చినగంజాం : మండలంలోని చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని ముస్లింలు ర్యాలీగా ఈద్గా, మసీదుల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలకు హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఇంకొల్లు : స్థానిక ఈద్గా వద్దకు అధికసంఖ్యలో ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పర్చూరులో

పర్చూరు: పర్చూరులోని ఇందిరా కాలనీ మసీదు, ఉప్పుటూరు, నూతలపాడు, నాగులపాలెం, చెరుకూరు, పోతుకట్ల తదితర గ్రామాల మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా ర్యాలీగా బయలుదేరి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దాన ధర్మాలు చేశారు. అలాగే కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

పేదలకు చీరల పంపిణీ

అద్దంకిటౌన్: రంజాన్ పండుగ సందర్భంగా వెంకటేశ్వర సప్లయర్స్ యజమాని షేక్ లాలు సాహెబ్ ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల వెనుక ఉన్న తన నివాసం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా మాదిరిగానే ఆయా కాలనీలలోని 250 మందికిపైగా పేద మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేసినట్లు లాలు సాహెబ్ తెలిపారు. ఈకార్యక్రమంలో మస్తాన్ బీ, షేక్ చిన్న లాలు, హబీదా బేగం, జుబేర్, హైదర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాడి రైతులకు బోనస్‌పై హర్షం

బల్లికురవ. మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ వృద్ధికి పాలు పోస్తున్న రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ డెయిరీ బోనస్ ప్రకటించటం హర్షణీయం అని పలు గ్రామాలకు చెందిన డెయిరీ అధ్యక్షులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలోని కృష్ణా మిల్క్ డెయిరీలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు కృష్ణా యూనియన్ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రాల అధ్యక్షులు ఎస్. బాలకృష్ణ, సుగుణ, వరప్రసాద్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చికెన్ ధర



పర్చూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగ పుణ్యమా అని చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్క రోజులోనే 50 శాతం ధర పెరగటం చికెన్ ప్రియులను ఆవేదనకు గురిచేసింది. ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రభావంతో చికెన్ ధరలు అనూహ్యంగా పడిపోయాయి. చివరకు కేజీ చికెన్ రూ.150లకు కూడా కొనేవారులేక దుకాణాలు వెలవెల బోయాయి. దీంతో వ్యాపారులు డీలాపడ్డారు. ఇటీవల ధరలు క్రమంగా పెరిగి రూ.180 నుంచి 200లకు చేరింది. ఉగాది రోజు ఉదయం కేజీ రూ.250 పలకగా సాయంత్రానికి రూ.300లకు చేరింది. రంజాన్ రోజూ అదే ధర కొనసాగింది. అలాగే మటన్ ధర రూ.1000కి చేరటంతో అధిక శాతం ప్రజలు చికెన్‌తోనే సరిపెట్టుకున్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై మినీలారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వి. గంగాధర్ (38) విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 23న ఈ ప్రమాదం జరిగిన విషయం పాఠకులకు విదితమే. మృతుడిది పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం. ఆస్పత్రినుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

గ్రానైట్ ఫ్యాక్టరీ కార్మికుడి మృతి

బల్లికురవ. మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ పరిధిలోని చందన గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు జోగిందర్ మహంత(47) మద్యం సేవించి నిద్రలోనే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఒడిస్సాకు చెందిన జోగిందర్ మహంత గ్రానైట్ ఫ్యాక్టరీలో పనులకు నెల రోజుల క్రితం వచ్చాడు. రెండు రోజుల క్రితం పూటుగా మద్యం సేవించి తోటి కార్మికులతో నిద్రించాడు. శనివారం తెల్లవారిన తరువాత ఎంత సేపటికీ నిద్ర లేవక పోవటంతో తోటి కార్మికులు చూసి వైద్య శాలకు తరలించే లోపే మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు నాని మహంత ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీవీ చౌదరి సోమవారం కేసు నమోదు చేశారు.

అదనపు ఆదాయ వనరుగా నాటుకోళ్ల పెంపకం

మార్టూరు,మార్చి31(ఆంధ్రజ్యోతి):నాటుకోళ్ల పెంపకం చేస్తూ కుటుంబాలకు అదనపు ఆదాయం వచ్చేటట్లుగా మహిళలు వినియోగించుకోవాలని ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు అన్నారు. సోమవారం స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో 30 మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు 30 నాటుకోళ్ల యూనిట్లను మోహనరావు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరెంజ్ ఎలిఫ్యాంట్ అనే అమెరికా సంస్థ ఆర్థిక సహకారంతో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో నాటుకోళ్ల యూనిట్‌లను పంపిణీ చేశామన్నారు. శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ మాట్లాడుతూ మహిళలలో పొదుపు చేసే గుణం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు,శానంపూడి లక్ష్మయ్య, షేక్ ఖాజాహుస్సేన్, ఎం.ఈశ్వరప్రసాద్, జాష్టి సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.



నాటుకోళ్లను అందుకున్న మహిళలతో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్

ప్రేమ, శాంతితో క్రైస్తవులు ముందుకు సాగాలి

చీరాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులు ద్వేషాలు, పగలు వంటి వాటికి దూరంగా ఉండి ఇతరుల పట్ల శాంతి, కరుణ, సోదర భావంతో ముందుకు సాగాలని పలువురు మత బోధకులు అన్నారు. ఇటీవల పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ఆందోళన వాతావరణం నెలకొనడంతో సోమవారం మరియమ్మపేట పునీత ఆంథోనీ ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో చీరాల నుంచి కారంచేడు లూర్దు మాత దేవాలయం వరకు ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అందరూ శాంతితో ఉండాలని, మృతి తీరని ఆవేదనను కలిగించిందని వివరించారు. కార్యక్రమంలో మత బోధకులు జగన్, సందీప్, డేవిడ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిగ్గుతేల్చాలి

అద్దంకిటౌన్ : పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని అద్దంకి నియోజకవర్గ పాస్టర్స్ యూనియన్ కోరింది. సోమవారం స్థానిక రామ్‌నగర్ నుంచి బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుత నిరసన ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. పాస్టర్ ఆర్ భాస్కర్, ఏ. బర్నబాస్, కె. రామారావు, ఎస్సీ ఎస్టీ,బీసీ, మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, ఆర్టీసీ ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా కాంతారావు, బీఎస్పీ నాయకులు, పలు మండలాల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.